RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 25 | సోమవారం 01 - 09 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## సెప్టెంబర్ నెలలోనూ 109 శాతం అత్యధిక వర్షాలు

ఉత్తరాఖండ్, దక్షిణ హరియ్యాణా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లకు భారీ వర్షసూచన

దక్షిణ, ఈశాన్య, తూర్పు, వాయవ్య భారత్‌లలో తక్కువ వర్షాలే- ఉత్తరాఖండ్‌లో నదులు ఉప్పొంగే ముప్పు



దేశంలో సెప్టెంబరు నెలలోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలే కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. సాధారణంగా ఏటా సెప్టెంబరులో 167.9 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంటుంది. అయితే ఈసారి అదే నెలలో సాధారణం కంటే 109 శాతం ఎక్కువ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. - మిగతా 2 లో

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ల సత్తా

తమిళ నిర్మాత, సూర్య 2డీ సంస్థ సీఈఓ రాజశేఖర్ కుమార్తె ఆంత్రాకు రెండు పతకాలు

వ్యక్తిగత విభాగంలో కాంస్యం, టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం కైవసం

వ్యక్తిగత విభాగంలో మూడు పతకాలూ తమిళనాడు అమ్మాయిలకే

2028 ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యమని తెలిపిన ఆంత్రా తండ్రి




ప్రముఖ తమిళ నటుడు సూర్యకు చెందిన '2డీ ఎంటర్‌టైన్‌మెంట్' నిర్మాణ సంస్థ సీఈఓ, నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ కుమార్తె ఆంత్రా రాజశేఖర్ అంతర్జాతీయ షూటింగ్ లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కజకిస్థాన్‌లో జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా రెండు పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేసింది. ఈ పోటీల్లో ఆమె ఒక స్వర్ణం, ఒక కాంస్యం గెలుచుకుంది. - మిగతా 2 లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్

- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టాలని డిమాండ్
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం పోరాడాలని పిలుపు
- బీసీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ
- తెలంగాణ సాధనలో కేసీఆర్ దీక్షను గుర్తు చేసిన కేటీఆర్
- బీసీ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు అని స్పష్టీకరణ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ కీలక సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు కేంద్రం ఆమోదం పొందేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం శాసనసభలో పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "ప్రధానికి ఐదుసార్లు లేఖ రాశానని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అపాయింట్‌మెంట్లు అడగడం కాదు, చిత్తశుద్ధిని చాటుకోవాలి. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే, రేవంత్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ బిల్లు పాసయ్యే వరకు నిరవధిక నిరాహార దీక్షకు దిగాలి" - మిగతా 2 లో

## నిజాంను మించిన శ్రీమంతుడు కావాలనేదే కేసీఆర్ కోరిక

- తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లను దోచుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని మండిపడ్డారు.
- కేసీఆర్‌కు ధనాశ, దురాశ కలగడం మూలంగానే లొకేషన్ మార్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



కాళేశ్వరం కమిషన్ నివేదిక పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లను దోచుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని మండిపడ్డారు. ఆనాడు మహారాష్ట్రతో చర్చ జరిగింది కేవలం ప్రాజెక్టు ఎత్తు గురించే అని గుర్తుచేశారు. కావాలనే హరీష్ రావు పదే పదే తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు ఉన్నాయని చెప్పినా మీరెందుకు వినలేదని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టుకు - మిగతా 2 లో

## సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం




2 లో

- మన్ కీ బాత్'లో ఆపరేషన్ పోలోను గుర్తు చేసుకున్న ప్రధాని మోదీ
- సర్దార్ పటేల్ చొరవతోనే నిజాం పాలన నుంచి విముక్తి
- తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది
- ప్రధాని వ్యాఖ్యలపై బండి సంజయ్, కిషన్ రెడ్డి హర్షం

## పాక్‌కు సపోర్ట్ చేసిన చైనాతో స్నేహమేంటి

- భారత్, చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందన్న మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్
- మోదీ ప్రభుత్వం వెన్నుముక లేనట్లు ప్రవర్తించిందని విమర్శ




చైనాలోని తియాంజిన్‌లో ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని మోదీ? మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-చైనా సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని మోదీ ప్రకటించడాన్ని తప్పుబట్టింది. చైనా బెదిరింపుల వల్ల ఇలా అన్నారని అనుకోవాలా లేదా మోదీ సర్కార్ వెన్నెముక లేనితనం అని నిర్వచించాలా? అని ప్రశ్నించింది. "2020 జులైలో గల్వాన్ లోయలో చైనా దురాక్రమణకు పాల్పడింది. ఆ సమయంలో మన వీర జవాన్లు 20 మంది దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. దీనిని ఖండించాల్సిన మన ప్రధాని మోదీ, 2020 జూన్ 19న చైనాకు క్లీన్ చీట్ ఇచ్చారు. వాస్తవానికి లద్దాఖ్‌లోని మన భూభాగం నుంచి చైనా వెనక్కు వెళ్లాలని మన ఆర్మీ చీఫ్ డిమాండ్ చేశారు. కానీ దీనిని సాధించడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైంది. పైగా ఇప్పుడు చైనాతో సయోధ్యకు సిద్ధమైంది. ఈ విధంగా చైనా ప్రాదేశిక దురాక్రమణను చట్టబద్ధం చేసింది."

- జైరాం రమేశ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎక్స్ పోస్ట్

పాక్‌కు సాయం చేసిన చైనా - మిగతా 2 లో

## అభ్యర్థుల కోసం మోదీ 'ప్రతిభా సేతు' పోర్టల్

### 125వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రకటన



యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ప్రతిభా సేతు పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. 125వ మన్ కీ బాత్ సందర్భంగా ఈ విషయాన్ని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో స్వదేశీ వస్తువులు, ఆకస్మిక వరదలు, క్రీడలపై ప్రధాని మోదీ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. 'యూపీఎస్సీ పేరు వినే ఉంటారు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒక్కటైన సివిల్ సర్వీసెస్ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తుంది. అత్యంత ప్రతిభావంతులైన వేలాది మంది అభ్యర్థుల స్వల్ప తేడాతో తుది జాబితాలో చోటు కోల్పోతుంటారు. ఫలితంగా వారు వేరే పరీక్షల కోసం మళ్లీ సిద్ధం కావాల్సి ఉంటుంది. దీని వల్ల సమయం, డబ్బు రెండు కోల్పోతారు. అలాంటి వారి కోసం కొత్తగా డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించాం. దాని పేరు ప్రతిభా సేతు. ప్రతిభా సేతులో యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో అన్ని దశలు దాటి తుది జాబితాలో చోటు దక్కని వారి డేటా ఉంటుంది. ఈ పోర్టల్‌లో 10వేల మందికిపైగా ప్రతిభావంతులైన డేటా ఉంది. ఈ పోర్టల్ ద్వారా ప్రైవేటు సంస్థలు అభ్యర్థుల సామర్థ్యాన్ని తెలుసుకొని ఉద్యోగాలు ఇవ్వొచ్చు. - మిగతా 2 లో

## మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం

- ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానం
- స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని పిలుపు
- ఆహ్వాన లేఖను పంపిన ఆస్ట్రేలియన్ హైకమిషన్



ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు మంత్రి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి మంత్రికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రతిష్ఠాత్మక స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో పాల్గొనాలని మంత్రి లోకేశ్కు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రశంసించింది. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ ను కోరింది. గత 20 ఏళ్లలో భారత్ కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని పేర్కొంది. 2001లో ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఇందులో పాల్గొన్నారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, - మిగతా 2 లో

## ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు.. తెనాలిలో స్వయంగా అందించిన మంత్రి నాదెండ్ల

- తెనాలి నియోజకవర్గం నందివెలుగులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల కుటుంబాలకు కొత్త కార్డుల పంపిణీ లక్ష్యం
- సెప్టెంబర్ 15లోగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామన్న మంత్రి నాదెండ్ల
- క్యూఆర్ కోడ్, పోర్టబులిటీ సౌకర్యాలతో ఆధునిక సాంకేతికతతో కార్డులు
- అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల హామీని అమలు చేస్తున్నామని వెల్లడి




ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 1.46 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని నందివెలుగు గ్రామంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి మంత్రులు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ తేదీలోగా ప్రతి ఇంటికీ స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్డుల ద్వారా రాష్ట్రంలోని సుమారు నాలుగు కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## అయోమయంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా




మనదేశ ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ రంగంపై ఆధారపడి రాష్ట్రంలో ప్రత్యక్షంగా 15 లక్షల మంది ఉపాధి పొందుతుండగా.మనదేశ ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ రంగంపై ఆధారపడి రాష్ట్రంలో ప్రత్యక్షంగా 15 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, పరోక్షంగా దాదాపు 20లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. మన దేశ ఆక్వా ఎగుమతులకు ఎంతో కాలంగా అమెరికా ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటీవల ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల దెబ్బతో ఈ రంగం తీవ్రంగా ప్రభావితమవుతున్నది. ఆక్వా ఎగుమతుల పరంగా అమెరికాపై ఎక్కువగా ఆధారపడటం, ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వాలు ముందస్తుగా దృష్టి సారించకపోవడం, అంతర్గతంగా దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల వినియోగంపై బుద్ధిపూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం వంటి అనేకానేక కారణాలు నేడు ఏపీలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న అయోమయ, ఆందోళనకర పరిస్థితులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారణమవుతున్నాయి.మనదేశం నుంచి అమెరికాకు చేసే ఇతర ఎగుమతులతో పోలిస్తే ఆక్వా ఉత్పత్తులకు సంబంధించి నిర్ణీతమైన కాల పరిమితులున్నాయి. అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కుని, ఆక్వా ఉత్పత్తులను విక్రయించే సౌకర్యాలు ఏ మాత్రం అందుబాటులో లేవు. ఈ ఉత్పత్తుల్లో అధిక వాటాను ఆక్రమించే రొయ్యలను ఒడ్డుకు చేర్చిన నిర్ణీత గడువులోగా మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆ ఆహార పదార్థాలు వినియోగానికి పనికిరాకుండా పోయి, ఉత్పత్తిదారులు పూర్తిస్థాయిలో నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం ఎగుమతి చేసిన 62,408 కోట్ల రూపాయల విలువైన మొత్తం ఉత్పత్తుల్లో దాదాపు 44 శాతం రొయ్యల ఎగుమతులున్నాయి. ఈ ఉత్పత్తుల్లో అమెరికాకు 36.4 శాతం, చైనాకు 17.2 శాతం, యూరప్ దేశాలకు 15శాతం ఎగుమతులు నమోదయ్యాయి. గత ఏడాది మన దేశం ఉత్పత్తి చేసిన 17లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ నుంచే దాదాపు 11లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తి నమోదయ్యింది. మన దేశ చేపల ఉత్పత్తిలోనూ ఒక్క ఏపీ మాత్రమే దాదాపు మూడోవంతు ఉత్పత్తిని సాధిస్తూ, దేశం ఆర్జిస్తున్న విదేశీ మారక ద్రవ్యంలోనూ సుమారు మూడోవంతు భాగస్వామ్యాన్ని రాష్ట్ర ఆక్వా రంగం జోడిస్తున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల వ్యాప్తంగా 5,72,065 ఎకరాల్లో చేపల చెరువులు విస్తరించి ఉన్నాయి. రెండు లక్షల ఎకరాల్లో సంప్రదాయ నీటి వనరుల నుంచి చేపలు, రొయ్యల సాగును కొనసాగిస్తున్న లక్షలాది మంది మత్స్యకారులున్నారు.ఇంతటి ప్రాధాన్యాన్ని కలిగిన ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వాలు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన అమలు పరచాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు తాత్కాలిక ఉపశమనాలకంటే దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించడమే ఎక్కువగా మేలు చేకూరుస్తుంది. ఏపీ నుంచి అనేక దశాబ్దాలుగా ఎక్కువ మోతాదులో ఉత్పత్తి చేస్తున్న 'వెనామి' రొయ్యల సాగుపై మాత్రమే దృష్టి కేంద్రీకరించకుండా, పలు దేశాల్లో వినియోగానికి ఆస్కారం ఉన్న ఇతర రకాలైన చేపలు, రొయ్యల వంగడాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. అనేక దశాబ్దాలుగా కొనసాగిస్తున్న శీతలీకరణ పద్ధతుల్లో రొయ్యలు ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు వీలున్న ఇతర మార్గాలను అన్వేషించడంతో పాటుగా, ఆ రంగానికి ఉపకరించే ప్రోత్సాహకాలనూ ప్రభుత్వపరంగా అందించాల్సిన అవసరం ఉన్నది. ఇందులో ప్రధానంగా 'వాక్యూమ్ ఫ్రీజ్ డ్రైయింగ్' లాంటి అత్యాధునిక విధానాలను అనుసరించడం ద్వారా ప్రాసెస్ చేసిన రొయ్యలను దాదాపు ఇరవై ఏళ్ల పాటు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది! ఫలితంగా మార్కెటింగ్‌లో ఒత్తిళ్లు పూర్తిస్థాయిలో తగ్గిపోయి అంతిమంగా రైతులకు, సరఫరాదారులకు, ఎగుమతిదారులకు కాలపరిమితులకు సంబంధించిన వెసులుబాటు లభిస్తుంది.ఎన్నో ఏళ్లుగా కేవలం అమెరికా మార్కెట్ మీద మాత్రమే ఆధారపడిన ఎగుమతుల విధానాన్ని సవరించుకుని మన దేశం నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులను చేసుకోగలిగే ప్రత్యామ్నాయ మార్కెట్ వెసులుబాటు ధోరణులను అనుసరించడం మరింత శ్రేయస్కరంగా ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా ఇంతకాలంగా బుద్ధిపూర్వకంగా విస్మరించిన దేశీయ మార్కెట్లలో స్థానిక ఆక్వా ఉత్పత్తులను 'రెడీ టు కుక్', 'రెడీ టు ఈట్' లాంటి విలువల జోడింపు (వాల్యూ యాడెడ్) విధానాల్లోకి మార్చుకునే ఆధునిక సాంకేతిక 'ఫుడ్ ప్రాసెసింగ్' పద్ధతులను అనుసరించడం ఆక్వా రంగ రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. ఏది ఏమైనా ఆక్వా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

# పాక్‌కు సపోర్ట్ చేసిన చైనాతో స్నేహమేంటి

మొదటి పేజీ తరువాయి

"ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ నేరుగా భారత్‌పై దాడులకు దిగింది. ధీటుగా స్పందించిన భారత్?, పాక్‌ను చావుదెబ్బ కొట్టింది. అయితే ఆ సమయంలో చైనా బహిరంగంగా పాకిస్థాన్‌కు మద్దతు నిలిచింది. ఆయుధాలతోపాటు సాంకేతిక సహకారాన్ని అందించింది. దీనిని జిన్?పింగ్?తో భేటీ సందర్భంగా మోదీ ప్రస్తావించకపోవడాన్ని జైరాం రమేశ్ తప్పుపట్టారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా ఫుల్ సపోర్ట్?గా నిలిచింది. ఈ విషయాన్ని 2025 జులై 4న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్?, లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్? చాలా స్పష్టంగా చెప్పారు. ఆ అంశాన్ని కూటమిపై ప్రశ్నించడానికి బదులుగా, మోదీ సర్కార్ నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఇప్పుడు చైనా పర్యటనలో ఉన్న మోదీ, కనీసం దాని గురించి మాట్లాడలేదు. చైనా దుర్మార్గపు చర్యలను ఖండించాల్సిన మోదీ, అలా చేయకుండా, చిరునవ్వుతో జిన్?పింగ్?తో కరచాలనం చేశారు" అని జైరాం రమేశ్ విమర్శించారు."చైనా యార్లుంగ్ త్సాంగ్పో నదిపై భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. దీని నిర్మాణం పూర్తయితే భారత ఈశాన్య రాష్ట్రాలపై చాలా దుష్ప్రభావం పడుతుంది. దీనిపై కూడా మోదీ ఒక్క మాట మాట్లాడలేదు. చైనా ఉత్పత్తులు భారత్‌లోకి ఎలాంటి నియంత్రణ, అడ్డంకులు లేకుండా వస్తున్నాయి. దీని వల్ల మన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) తీవ్రంగా నష్టపోతున్నాయి. వీటిపైనా మోదీ సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.?మరోవైపు ప్రధాని మోదీ చైనా పర్యటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్?) విమర్శలు గుప్పించింది. చైనా ఆక్రమించిన భూమిని తిరిగి భారత్‌కు అప్పగించాలని మోదీ కోరాలని డిమాండ్ చేసింది. "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు అని ప్రధాని మోదీ అన్నారు. ఆ మాటలను నేను మళ్లీ గుర్తు చేయాలని అనుకుంటున్నాను. చైనా గల్వాన్ లోయలో మన సైనికులపై దాడి చేసింది. మన సైనికులను చంపి, మన భూభాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ భూమి ఇప్పటికీ చైనా ఆధీనంలోనే ఉంది. కానీ మోదీ సర్కార్ దీనిని అంగీకరించడం లేదు. మొదట మోదీ, మన భూమిని మనకు అప్పగించండని చైనాను అడగాలి. కానీ మోదీ అలా చేయడం లేదు. అమెరికాతో కలిసి ఉండలేకపోతున్నాం కనుక, చైనాతో కలిసి ఉండాలని ప్రయత్నిస్తున్నారు. ఇదేనా అంతర్జాతీయ దౌత్యం అంటే" అని దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు.ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణపై దృష్టి కేంద్రీకరించారు. అందుకే 'పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్?పింగ్?కు స్పష్టం చేశారు. సరిహద్దు నిర్వహణపై కూడా భారత్, చైనా ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం ఉందని మోదీ స్పష్టం చేశారు. గతేడాది కజాన్‌లో జరిగిన చర్చల తర్వాత భారత్?, చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొంది అని పేర్కొన్నారు. గల్వాన్ ఘర్షణల తరువాత భారత్?–చైనా ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు ఇరువురు నేతలు విస్తృత చర్చలు జరిపిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తరువాత షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ)కు చైనా విజయవంతంగా అధ్యక్షత వహించినందుకు జిన్?పింగ్?కు అభినందనలు తెలిపారు.

# సెప్టెంబర్ నెలలోనూ 109 శాతం అత్యధిక వర్షాలు

మొదటి పేజీ తరువాయి

అయితే ఈశాన్య భారత్, తూర్పు భారత్, దక్షిణ భారత్, వాయవ్య భారత్‌లోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలే పడొచ్చని తెలిపింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ స్థాయిలో, సాధారణాన్ని మించిన స్థాయిలో వానలు పడే అవకాశాలు ఉన్నాయని చెప్పింది. ఆదివారం దిల్లీలో విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్రా ఈ వివరాలను వెల్లడించారు. సెప్టెంబరులో ఉత్తరాఖండ్, దక్షిణ హరియాణా, దిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చన్నారు ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్రా. దీనివల్ల ఆకస్మిక వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి జనజీవనం స్తంభించే ముప్పు ఉంటుందని ఆయన తెలిపారు. చాలావరకు నదుల జన్మస్థానం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనే ఉందని, భారీ వర్షాల వల్ల ఈ నదులు ఉప్పొంగి సమీపంలోని నగరాలు, పట్టణాల్లో వరదను సృష్టించే ముప్పు ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహానది ఎగువ పరివాహక ప్రాంతానికి భారీ వర్ష సూచన ఉందని మృత్యుంజయ్ మోహపాత్రా చెప్పారు.భారత్‌లో 1980 సంవత్సరం నుంచి ఏటా సెప్టెంబరులో కురిసే వర్షపాతం క్రమంగా పెరుగుతోందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్రా తెలిపారు. అయితే 1986, 1991, 2001, 2004, 2010, 2015, 2019 సంవత్సరాల సెప్టెంబరు నెలల్లో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. సెప్టెంబరులో పశ్చిమ మధ్య భారత్, వాయవ్య భారత్, దక్షిణ భారత్‌లలోని చాలా ప్రాంతాల్లో నెలవారీ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో, సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉండొచ్చని ఆయన తెలిపారు. తూర్పు మధ్య భారత్, తూర్పు భారత్, ఈశాన్య భారత్, వాయవ్య భారత్‌లోని పలు ప్రాంతాలు, పశ్చిమ తీర ప్రాంతాలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ స్థాయిల్లో ఉండొచ్చన్నారు.ఆగస్టు నెలలో భారతదేశంలో మొత్తం 268.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని ఐఎండీ తెలిపింది. ఇది సాధారణం కంటే 5 శాతం ఎక్కువ. గత 3 నెలల్లో (జూన్ – ఆగస్టు) మన దేశంలో అత్యధికంగా 743.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వ్యవధిలో సాధారణం కంటే 6 శాతం ఎక్కువ వానలు పడ్డాయి.దక్షిణ భారతదేశంలో ఆగస్టు నెలలో ఇప్పటివరకు 250.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని ఐఎండీ వెల్లడించింది. సాధారణం కంటే ఇది దాదాపు 31 శాతం ఎక్కువ. 2001 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏటా ఆగస్టు నెలల్లో దక్షిణాదిలో కురిసిన 3వ అత్యధిక వర్షపాతం ఇదే. 1901 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆగస్టు నెలల్లో దక్షిణాదిలో కురిసిన 8వ అత్యధిక వర్షపాతం ఇదే. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్యకాలంలో (గత 3 నెలల్లో) మొత్తం 607.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏటా ఇదే మూడు నెలల వ్యవధిలో నమోదయ్యే సాధారణ వర్షపాతం (556.2 మిల్లీమీటర్లు) కంటే ఇది దాదాపు 9.3 శాతం ఎక్కువ.భారత్‌లోని వాయవ్య ప్రాంతంలో ఆగస్టులో 265 మి.మీ వర్షపాతం కురిసిందని ఐఎండీ పేర్కొంది. 2001 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆగస్టు నెలలో ఈ ప్రాంతంలో కురిసిన అత్యధిక వర్షపాతం ఇది. 1901 తర్వాత ఆగస్టులో కురిసిన 13వ అత్యధిక వర్షపాతం ఇది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రతినెలా వాయవ్య భారత్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే నమోదైంది. జూన్‌లో 111 మి.మీ, జులైలో 237.4 మి.మీ, ఆగస్టులో 265 మి.మీ వర్షం కురిసింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్య మొత్తం 614.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ మూడు నెలల వ్యవధిలో వాయవ్య భారత్‌లో సాధారణంగా 484.9 మి.మీ వర్షపాతమే నమోదవుతుంటుంది. అయితే ఈఏడాది మాత్రం 27 శాతం ఎక్కువ వానలు కురవడం గమనార్హం.వాయవ్య భారత్‌లో భారీ వర్షాల వల్ల హిమాలయ రాష్ట్రాలే ఎక్కువగా ప్రభావితం అయ్యాయని ఐఎండీ తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కుండపోత వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. నదులు పొంగిపొర్లడంతో సాగునీటి ప్రాజెక్టులు నిండిపోయాయి. దీంతో ప్రాజెక్టుల సమీపంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు అయ్యాయి. ఫలితంగా అక్కడ నివసించే లక్షలాది మంది నిరాశ్రయులు అయ్యారు. వేల హెక్టార్లలో వ్యవసాయ భూములు నీటమునిగాయి.

# అభ్యర్థుల కోసం మోదీ 'ప్రతిభా సేతు' పోర్టల్

మొదటి పేజీ తరువాయి

ఈ పోర్టల్ ద్వారా ఇప్పటికే వందలాది మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.అమెరికా సుంకాల వేళ ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ మంత్రాన్ని ఎత్తుకున్నారు. రానున్న రోజుల్లో వరుసగా పండుగలు ఉండటంతో ప్రతిఒక్కరు స్వదేశీ వస్తువులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు జీవిత ప్రయాణంలో వినియోగించే ప్రతీది స్వదేశీగా ఉండేటట్టు చూసుకోవాలని సూచించారు. 'ఈ సమయంలో దేశం మొత్తం గణేశ్ ఉత్సవాలను జరుపుకుంటోంది. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో మరిన్ని వేడుకలు జరుపుకోనున్నాం. ఈ పండుగల నడుమ స్వదేశీ మంత్రాన్ని మరవద్దు. భారత్‌లో తయారైన వస్తువులనే బహుమతులుగా ఇవ్వండి. దేశంలో ఉత్పత్తి అయిన వస్త్రాలనే ధరించండి. భారత్‌లో తయారైన వస్తువులతోనే ఇళ్లను అలంకరించండి. జీవిత ప్రయాణంలో వినియోగించే ప్రతీది స్వదేశీగా ఉండేటట్టు చూసుకోండి. స్వదేశీ అని గర్వంతో ఎలుగెత్తి చాటండి. ఇదే స్ఫూర్తితో మనం ముందుకెళ్లాలి. మన మంత్రం వోకల్ ఫర్ లోకల్. మన మార్గం ఆత్మనిర్భర్ భారత్. మన లక్ష్యం వికసిత్ భారత్' అని నరేంద్ర మోదీ అన్నారు. ఇక దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై ప్రధాని మోదీ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తులు దేశాన్ని పరీక్షిస్తున్నాయని అన్నారు. పలు రాష్ట్రాల్లో భారీ వరదలు కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అనేక మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సైన్యం, ఎన్?డీఆర్ఎఫ్, ఎస్?డీఆర్ఎఫ్ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగించారని కొనియాడారు. అలాగే వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.జమ్ముకశ్మీర్‌లో ప్రకృతి విపత్తు సంభవించినా అనేక విషయాల్లో ముందుకు వెళ్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఇటీవల శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి ప్రస్తావించారు. దేశ్యాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారని, పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ఇందులో ప్రతిభ చూపారన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కశ్మీర్‌లోని పుల్వామాలో తొలి డే అండ్ నైట్ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. దేశం మార్పువైపు పయనిస్తోందనడానికి ఇవి ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు.

# పచ్చి మిరపకాయలు తింటున్నారా

మొదటి పేజీ తరువాయి

పచ్చి మిరపకాయలు కేవలం రుచికి కారంగా మాత్రమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి ఎ, సి విటమిన్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మాన్ని ఆరోగ్యంగా, కంటి చూపును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పచ్చి మిరపకాయలను ఆహారంలో తగిన మోతాదులో చేర్చుకోవడం ద్వారా అద్భుతమైన ప్రయోజనాలను సులభంగా పొందవచ్చంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! యాంటీఆక్సిడెంట్ల : పచ్చి మిరపకాయల్లో ఉండే ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమ్మేళనాలు వృద్ధాప్య ఛాయలను తగ్గించి, అనేక దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని పేర్కొన్నారు. పచ్చి మిరపకాయలలో ఎ, బి2, బి3, బి6, బి9, సి, ఇ విటమిన్లు ఉంటాయని, విటమిన్ సి అనేది బలమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉండి శరీరాన్ని ఫ్రీ రాడికల్స్‌ను నుంచి రక్షణ కల్పిస్తుందని అధ్యయనంలో పేర్కొంది. క్యాన్సర్ నివారిణిగా : ఇందులో శక్తివంతమైన సహజ రసాయనాలు ఉంటాయని, ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా శరీరంలోని హానికరమైన కణాల పెరుగుదలను క్యాప్సైసిన్ ఆపుతుందని, కొన్ని రకాల కణాలను నాశనం చేస్తుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. రొమ్ము, కడుపు, పెద్దప్రేగు క్యాన్సర్ కణాలపై ఈ ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు.బరువు అదుపులో : పచ్చి మిరపకాయలు జీవక్రియను వేగవంతం చేసి, ఎక్కువ కేలరీలు ఖర్చయ్యేలా చేస్తాయని, ఇందులో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం కొవ్వును కరిగించడంతో పాటు కొవ్వు నిల్వలు ఏర్పడకుండా నిరోధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇవి కడుపు నిండిన అనుభూతిని ఎక్కువసేపు కలిగించడం వల్ల అతిగా తినకుండా ఉంటామని, తద్వారా ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి తోడ్పడుతుందని వివరించారు. గుండె ఆరోగ్యానికి : పచ్చి మిరపకాయలు రక్త ప్రసరణను మెరుగుపరచడం, రక్తం గడ్డకట్టడాన్ని నివారించడం, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇవి రక్తనాళాలలోని ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయని, తద్వారా గుండె సమస్యల ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు. షుగర్ అదుపులో : కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదించడంతో పాటు ఇన్సులిన్ ఉపయోగాన్ని మెరుగుపరుస్తుందంటున్నారు. దీనివల్ల శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకుంటుందని, తద్వారా రక్తంలో గ్లూకోజ్ అదుపులో ఉంటుందని పేర్కొన్నారు. మిరపకాయల ద్వారా బరువు తగ్గడం అనేది ఇన్సులిన్ మెరుగైన నియంత్రణ ఫలితంగా కూడా ఉంటుంది. ఇది బరువు నిర్వహణకు మద్దతతో పాటు ఊబకాయం, మధుమేహం, హృదయ సంబంధ రుగ్మతలు వంటి వ్యాధుల చికిత్సకు సానుకూల ప్రభావాలను కలిగి ఉంటుందని %చీఫ్‌అశీఖ్రీ అధ్యయనంలో పేర్కొంది. నొప్పిని తగ్గిస్తుంది : పచ్చి మిరపకాయల్లో సహజ యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయని, ఇవి కొన్ని సూక్ష్మజీవుల నుంచి రక్షణ ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇవి సహజ నొప్పినివారిణిలా పనిచేస్తాయని, ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఉపశమనం కలిగించవచ్చని పేర్కొన్నారు. పచ్చి మిరపకాయలను మితంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. కానీ, అధికంగా తీసుకుంటే అలర్జీలు లేదా జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారత యువ షూటర్ల సత్తా

కజకిస్థాన్‌లోని షిమ్కెంట్ నగరంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆంత్రా అద్భుత ప్రదర్శన కనబరిచింది. 'ట్రాప్ ఉమెన్ యూత్' వ్యక్తిగత విభాగంలో పోటీపడిన ఆమె కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. విశేషమేమిటంటే, ఇదే విభాగంలో స్వర్ణం, రజతం కూడా భారత క్రీడాకారిణులకే దక్కాయి. తనిష్కా సెంథిల్ కుమార్ స్వర్ణం గెలవగా, నీలా రాజా బాలు రజత పతకం సాధించారు. ఈ ముగ్గురూ తమిళనాడుకు చెందిన వారు కావడం గమనార్హం. ఇక టీమ్ ఈవెంట్‌లోనూ భారత అమ్మాయిలు సత్తా చాటారు. ఆంత్రా, తనిష్కా, నీలా కలిసికట్టుగా పోటీపడి 'ట్రాప్ ఉమెన్ యూత్ టీమ్' విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించారు. ఈ విజయంపై ఆంత్రా తండ్రి రాజశేఖర్ పాండ్యన్ ఆనందం వ్యక్తం చేశారు. ఆరు దేశాల నుంచి వచ్చిన షూటర్లతో గట్టి పోటీని ఎదుర్కొని తమ కుమార్తె పతకాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ పాండ్యన్ మాట్లాడుతూ, "నా కుమార్తెలలో ఒకరైనా నా ఇష్టమైన షూటింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలన్నది నా కల. కేవలం 17 ఏళ్ల ఆంత్రా నా కలను నిజం చేసింది. 12 ఏళ్ల వయసు నుంచే ఆమె షూటింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. భవిష్యత్తులోనూ ఇదే క్రీడలో కొనసాగాలని నిర్ణయించుకుంది" అని తెలిపారు. రాబోయే జాతీయ ఛాంపియన్‌షిప్‌తో పాటు, ఇతర పోటీలకు ఆంత్రా సిద్ధమవుతోందని, 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం

సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఈసారి అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో చారిత్రక 'ఆపరేషన్ పోలో'ను గుర్తుచేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోయిన హైదరాబాద్ సంస్థానాన్ని ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అతి తక్కువ సమయంలోనే 'ఆపరేషన్ పోలో' ద్వారా భారతదేశంలో విలీనం చేశారని సంజయ్ గుర్తుచేశారు. ఆదివారం ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ప్రసంగం అనంతరం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా స్పందించారు. "సెప్టెంబర్‌లో వచ్చే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటాం. ఆపరేషన్ పోలోలో పాలుపంచుకున్న వీరులందరినీ స్మరించుకుందాం" అని బండి సంజయ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతకుముందు, తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజల స్వేచ్ఛ కోసం సర్దార్ పటేల్ నేతృత్వంలో జరిగిన ఆపరేషన్ పోలోను, సాయుధ బలగాల ధైర్యసాహసాలను కొనియాడారు. "1947 ఆగస్టులో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, హైదరాబాద్ ప్రజలు మాత్రం 1948 సెప్టెంబర్ 17 వరకు వేచి చూడాల్సి వచ్చింది. నిజాం, రజాకార్ల అరాచకాలు రోజురోజుకు పెరిగిపోయాయి. త్రివర్ణ పతాకం ఎగరేయడం, 'వందేమాతరం' పలకడం కూడా ప్రాణాల మీదకు తెచ్చేది. పేదలు, మహిళలు తీవ్ర అణచివేతకు గురయ్యారు," అని ప్రధాని నాటి పరిస్థితులను వివరించారు. పరిస్థితి చేయిదాటిపోతోందని గ్రహించిన సర్దార్ పటేల్, ఈ విషయాన్ని తన చేతుల్లోకి తీసుకుని 'ఆపరేషన్ పోలో'కు రూపకల్పన చేశారని మోదీ తెలిపారు. రికార్డు సమయంలో మన సాయుధ దళాలు హైదరాబాద్‌ను నిజాం చెర నుంచి విడిపించి, భారతదేశంలో విలీనం చేశాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సర్దార్ పటేల్ ప్రసంగానికి సంబంధించిన వాయిస్ రికార్డును కూడా ప్రధాని వినిపించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు ఎంతగానో అభినందిస్తున్నారని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, సెప్టెంబర్ 17వ తేదీని ఏటా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా జరపాలని కేంద్ర ప్రభుత్వం గత ఏడాదే నిర్ణయం తీసుకుని, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

## ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులు..
# తెనాలిలో స్వయంగా అందించిన మంత్రి నాదెండ్ల

గుంటూరు జిల్లాలో 5.85 లక్షల మందికి, ఒక్క తెనాలి నియోజకవర్గంలోనే 83 వేల మందికి ఈ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ సౌకర్యంతో కూడిన ఈ కార్డును స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుడు సరుకులు తీసుకున్న వివరాలు వెంటనే ప్రభుత్వానికి చేరుతాయని, దీనివల్ల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. పోర్టబులిటీ విధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించామని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మనోహర్ తెలిపారు. దీపం-2 పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని నిలబెట్టుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా పార్టీలకు అతీతంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ దుష్ట ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. రేషన్ పంపిణీకి సంబంధించి ఏమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేయవచ్చని సూచించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను అమలు చేయడం గర్వకారణమన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రూ.4 వేల పెన్షన్, తల్లికి వందనం కింద రూ.10 వేల కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.3,175 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. అమరావతి, పోలవరం పనులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఎన్నికల ముందు నందివెలుగు గ్రామానికి రావడానికి రోడ్లు అధ్వానంగా ఉండేవని, ఇప్పుడు తాము వేసిన రోడ్లతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

## నిజాంను మించిన శ్రీమంతుడు కావాలనేదే కేసీఆర్ కోరిక

మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదు. 148 మీటర్ల ఎత్తులో కట్టుకోమని మహారాష్ట్ర కూడా చెప్పింది. అయినా వినకుండా ప్రాజెక్టు లొకేషన్‌ను మార్చారు. కేసీఆర్‌కు ధనాశ, దురాశ కలగడం మూలంగానే లొకేషన్ మార్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. లక్ష కోట్లు కొల్లగొట్టాలని ప్రణాళిక వేసుకున్నారు. పొగతాగడం ఆరోగ్యానికి హానికరం అని రాసినట్లే.. ప్రాజెక్టు కడితే హానికరం, నిరుపయోగం అని అధికారులు పదే పదే చెప్పారు. అయినా కూడా వినకుండా దోచుకోవడమే లక్ష్యంగా చేసుకొని కట్టారని అన్నారు. నిజాం ప్రభువు కంటే శ్రీమంతుడు కావాలనేదే కేసీఆర్ కోరిక అని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్లలో నీళ్లు ఉన్నాయని ఉమా భారతి చెప్పారని స్పష్టం చేశారు.

# ఇకనైనా మేల్కొందాం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగు మతులపై 50 శాతం టారిఫ్‌లు విధించడం, భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా మారింది. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షగా ఈ టారిఫ్‌లు విధించారు. మునుపటి 25 శాతం టారిఫ్‌లను రెట్టింపు చేయడం ద్వారా, అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులు సుమారు 87 బిలియన్ డాలర్లు ఉంటుంది. ఇందులో 55 శాతం వరకు ప్రభావితమవుతుందని ఎక్స్‌పోర్టర్ సంఘాలు అంచనా వేస్తున్నాయి.ట్రంప్ టారిఫ్‌లు భారత్‌లోని పలు రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా లేబర్-ఇంటెన్సివ్ రంగాలు అత్యంత ఎక్కువగా దెబ్బతింటాయి. టెక్స్‌టైల్స్, అప్పారెల్ రంగాలకు అతి పెద్ద దెబ్బ తగులుతుంది. భారత్ నుంచి అమెరికాకు టెక్స్‌టైల్ ఎగుమతులు సుమారు 12 బిలియన్ డాలర్లు, ఇందులో మిలియన్ల మంది కార్మికులు పని చేస్తున్నారు. టారిఫ్‌లు 5.8 శాతం నుంచి 55.8 శాతానికి పెరగడంతో, కంపెనీలు లాభాలు తగ్గి, కార్మికుల ఉద్యోగాలు కోల్పోవచ్చు. ఉదాహరణకు, తిరుపూర్, బెంగళూరు ప్రాంతాల్లోని చిన్న ఫ్యాక్టరీలు ఇప్పటికే ఆర్డర్లు తగ్గుతున్నాయని రిపోర్టులు చెబుతున్నాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనాల ప్రకారం, ఈ రంగంలో 5-7 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి. జెమ్స్ అండ్ జ్యువెలరీ రంగానికి కూడా పెద్ద మొత్తంలో నష్టం జరగనుంది.

## మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం

ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి
# బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్

అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి, లక్ష్యం నెరవేరే వరకు తిరిగి రానని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. "అదే తరహా పట్టుదలను రేవంత్ రెడ్డి కూడా ప్రదర్శించాలి. బీసీ బిల్లు సాధించే వరకు ఢిల్లీలోనే ఉండాలి" అని అన్నారు. 2004లోనే దేశంలో తొలిసారిగా ప్రత్యేక ఓబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన, చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపామని వివరించారు. బీసీ రిజర్వేషన్లపై ఐదుసార్లు మాట మార్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఎలా నమ్ముతారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. "42 శాతం బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌కు మేము పూర్తిగా మద్దతు ఇస్తున్నాం. కానీ చట్టాలు లొసుగులు లేకుండా ఉండాలి. లేదంటే న్యాయ సమీక్షలో అవి నిలబడవు. కేవలం ప్రకటనలు కాదు, నిబద్ధత ముఖ్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# సంచార జాతులు, నిరాశ్రయులకు దుస్తులు, ఔషధాలు పంపిణి



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్' :** హైదరాబాద్ మహా నగరంలో రోడ్ల పక్కన పుటపాతులే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, నిరుపేదలు, సంచార జాతుల వారికి దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణి చేసి, మారిన వాతావరణంగా సీజనల్ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఔషధాలను అందించి, ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు ప్రథమ చికిత్సను అందించాము. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్. వై. సంజీవ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని, సేవ సభ్యులు పాల్గొన్నారు.

# జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ముషీరాబాద్, ఆగస్టు 31 :** జనహిత సేవా ట్రస్ట్, యువశక్తి యూత్ అసోసియేషన్, కిమ్స్ ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముషీరాబాద్ లోని జమిస్తాన్ పూర్ లో యువశక్తి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద జరిగిన శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ లు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, క్యాంపు కో ఆర్డినేటర్ లు బి. నర్సింగ్ రావు, జే. విక్రమ్ పాల్గొన్నారు.

# వైభంగా గణేష్ నిమజ్జన ఉత్సవం శోభాయాత్ర..



**ముధోల్:ఆగస్టు 31:తెలంగాణ సేనా న్యూస్.** : ముధోల్, ఆగస్టు 31: ముధోల్ మండలం పరిధిలోని విటోలి తాండ, రాజు తండా, విటోలి. కరేగాం గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు ఐదవ రోజున అంగరంగ వైభవంగా జరిగాయి, ఈ వేడుకల్లో యువత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,ఈ ఉత్సవాల్లో భాగంగా విటోలి తాండలో నిర్వహించిన లడ్డు వేలంపాట ఉత్సాహంగా, హోరా హోరీగా సాగింది, ఈ వేలంలో రూ, 7వెల కు లడ్డును రాథోడ్ శేషరావు దక్కించుకున్నారు, గణపతి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ వారి కుటుంబంపై ఉండాలని గ్రామస్తులు కోరారు,నిమజ్జన ఊరేగింపులో "గణపతి బప్పా మోరియా" అనే నినాదాలు మార్మోగాయి, బంజారా ఆడపడుచులు, పెద్దలు, మరియు యువకులు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు,ఈ వేడుకల సందర్భంగా వివిధ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది..

# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఘన సన్మానం




**వేములవాడ,ఆగస్టు 31 (తెలంగాణ సేన):** శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో నేడు పదవీ విరమణ పొందిన సిబ్బంది శ్రీ తాంద్ర రాజేశ్వరరావు (డిప్యూటీ ఈ ఈ) మరియు శ్రీ నమిలికొండ (గుమ్మి) పవన్ లకు ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్‌లో ఆలయ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యం లో, కార్యనిర్వహణాధికారి అధ్యక్షతన ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన వారి అమూల్యమైన సేవలను కొనియాడారు. వారిని కార్యనిర్వహణాధికారి ఘనంగా సత్కరించగా, ఉద్యోగ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. తదనంతరం అర్చక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తో పాటు ఆలయ సిబ్బంది, విశ్రాంత ఆలయ ఉద్యోగులు మరియు యూనియన్ సభ్యులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న వారి సేవలను గుర్తు చేసుకున్నారు.

# జిపి లడ్డా విద్యా సంస్థలోని వినాయకుని నిమజ్జనం



**భైంసా:ఆగష్టు 31:తెలంగాణ సేన న్యూస్.** : భైంసా :పట్టణంలోని జిపి లడ్డ డిగ్రీ కళాశాల మరియు జి పి లడ్డా టిటిసి కళాశాలలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఐదు రోజులు పూజలను అందుకున్న వినాయకుని నిమజ్జనం 5 వ రోజు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఐదు రోజులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించి ఈరోజు నిమజ్జనం ఘనంగా జరిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈ సంజీవ్ కుమార్ మరియు యాజమాన్యం మె0చు శివాజీ కుంట రవి శ్రీనివాస్ ఆకాష్ మరియు అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# బాసర ఆలయ స్పేషల్ ఆఫీసర్ గా అజ్మీరా సంకేత్ కుమార్...




**ఆగస్టు 31 తెలంగాణ సేన ( ప్రతినిధి బాసర ) నిర్మల్ జిల్లా :-** బాసర దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన జ్ఞాన సరస్వతి దేవస్థానము స్పెషల్ ఆఫీసర్ గా అజ్మీరా సంకేత్ కుమార్ ను నియమిస్తూ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. గతం నుండి ఆలయ ఇంచార్జి ఈఓ గా కీసర గుట్ట ఈఓ సుధాకర్ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఇంచార్జి పాలనతో ఆలయం పర్యవేక్షణ లోపం అభివృద్ధి పై ప్రభావం పడింది. పాలన కుడా గాడి తప్పిందన్న విమర్శలు లేకపోలేదు.దీంతో ఆలయ అభివృద్ధికి కోసం స్పెషల్ ఆఫీసర్ గా ఐఎఎస్ అధికారిని నియమించాలన్న ప్రతిపాదన చాలా రోజుల నుంచి పెండింగ్లో ఉండేది. జిల్లా కలెక్టర్ ఈ విషయం లో చొరవ చూపి ఆలయ అభివృద్ధి కోసం భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ను బాసర ఆలయ స్పెషల్ ఆఫీసర్ గా నియమించారు. దీంతో బాసర ఆలయం అభివృద్ధి పారదర్శకంతో పాటు, ఆలయ ఉద్యోగుల విధి నిర్వహణ పై నిఘాతో పాటు భక్తులు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటారన్న ,అభిప్రాయంస్థానికులు, భక్తులు ,వ్యక్తం చేశారు . స్పెషల్ ఆఫీసర్ నియామకం పై హర్షం వ్యక్తం అవుతుంది.

# బీసీ వర్గాల జీవితాలలో వెలుగు నింపేందుకే 42 శాతం రిజర్వేషన్లు

## కాప్ ఎత్తివేసి 42 శాతం రిజర్వేషన్ అమలుకు మంత్రివర్గ నిర్ణయం పట్ల హర్షం.

## బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



**హైదరాబాద్ ఆగస్టు 31, తెలంగాణ సేన: :** ఆదివారం నాడు అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరుతున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆదివారంనాడు పత్రికలకు ఒక ప్రకటన విదుదల చేస్తూ, గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, రాష్ట్ర మంత్రివర్గానికి, ఏ.ఐ.సి. సి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కి లోక్ సభప్రధాన ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీకి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఏఐసిసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ కి మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాల వ్యాప్తంగా బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఈ 42 శాతం రిజర్వేషన్లు బీసీ వర్గాలలో, వారి జీవితాలలో వెలుగు నింపుతుంది అనడంలో అతిశయోక్తి లేదు అన్నారు. ఈరోజును సువర్ణ అక్షరాలలో లిఖించదగ్గరోజని, ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్న నేపద్యంలో బీసీలు సంబరాలు చేసుకోవాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను విమర్శించే స్థాయి బి ఆర్ ఎస్ నేతలకు లేదు..

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్..




**వేములవాడ,ఆగస్టు 31 (తెలంగాణ సేన)::** వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి బి ఆర్ ఎస్ నేతలకు కనిపించడం లేదు అని,10 సంవత్సరాలలో జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న తమ నేత వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక విపరీత ఆరోపణలు చేస్తున్నారని వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.ఆదివారం వేములవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు పుల్కం రాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ కనీసం వార్డు మెంబర్గా కూడా గెలుపొందని వ్యక్తులు చవకబారు ఆరోపణలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదు అని హెచ్చరించారు. వేములవాడలో జరుగుతున్న అభివృద్ధిపై ఎమ్మెల్యే మాట్లాడాలని డిమాండ్ చేస్తున్న గులాబీ నేతలకు అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి ఆరోపణలు చేస్తే ఊరుకోమని పేర్కొన్నారు...

# వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మరో 4 మోకాలు మార్పిడి ఆపరేషన్లు..



**వేములవాడ,ఆగస్టు 31 ( తెలంగాణ సేన ):** వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఈ రోజు మరో 4 మోకాలు మార్పిడి ఆపరేషన్లు వైద్యులు దిగ్విజయంగా పూర్తి చేశారు.ఇప్పటి వరకు 48 మోకాలు మార్పిడి ఆపరేషన్లు జరిగాయనీ, వేములవాడ ప్రాంత ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ఈ ఆపరేషన్ల కోసం వేములవాడకు వస్తున్నారనీ,దాదాపు 100 మంది ఈ ఆపరేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని ఇకనుండి క్రమం తప్పకుండా ప్రతివారం మోకాలు మార్పిడి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు...

# ఎడ్ బిడ్ చెరువును పరిశీలించిన అధికారులు




**ముధోల్,31ఆగస్టు(తెలంగాణ సేన న్యూస్) :** మండలంలోని ఎడ్ బిడ్ తోర్ చెరువును ఆదివారం ఇరిగేషన్ ఎఈ దేవేందర్, ఆర్ఐ నారాయణ్ రావు పటేల్, ఎంపీడీవో శివకుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోర్ చెరువు పూర్తిగా నిండిపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో అధికారులు చెరువు పరిశీలించి తగు జాగ్రత్తలను తీసుకుంటామని గ్రామస్తులకు తెలియజేశారు. గతంలో మిషన్ కాకతీయ పనులతో నామమాత్రంగా చెరువు పనులను నిర్మించారని గ్రామస్తులు ఆవేదన చెందారు. దీంతో భారీ వర్షాలకు చెరువు గండి పడే అవకాశం ఉందని ఆరోపిం చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ పేరిట తూతు మాత్రంగా పనులను చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి అన్నారు. తోర్ చెరువు గండి పడితే 100 ఎకరాల్లో పంటలు నష్టపోతార ని అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తో ర్ చెరువు పూర్తిగా నిండి ఉండడంతో గ్రామస్తులకు ముందస్తు సలహాలు ,సూచనలను అధికారులు అందజేశారు.

# గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ - సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గా శ్రవణ్ రెడ్డి



**తెలంగాణ సేనా న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ - కో ఆర్డినేటర్ గా నూతనంగా నియమించబడిన మర్కూక్ మండల్ మర్కూక్ గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నియమించింది..శ్రవణ్ రెడ్డిపై నమ్మకం ఉంచి గజ్వేల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గా నియమించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి,నేషనల్ సోషల్ మీడియా ఇంచార్జ్ మను జైన్,రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ వంగా లక్ష్మీకాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియచేసారు.. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని తప్పకుండా నిలబెట్టుకుంటా అని శ్రవణ్ రెడ్డి తెలిపారుద.

# భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్డు నిర్మించాలి

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల శ్రీనివాస్



**ముధోల్:ఆగష్టు 31:తెలంగాణ సేనా న్యూస్ :** ముధోల్:ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన వ్యవసాయ రోడ్లు ప్రభుత్వం నిర్మించాలని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అదేవిధంగా గోదావరి నది పుష్కర ఘాట్ ,లిఫ్ట్ ఇరిగేషన్ ఇంటెక్ వెల్ కు వెళ్ళే దారిని సైతం నిర్మించాలన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అష్టా గ్రామంలో పంట పొలాలకు వెళ్ళే ప్రధాన రోడ్డు గోదావరి నదికి అనుకుని ఉండడంతో వరదకు పూర్తిగా ధ్వంసమై పంట పొలాల్లో నీరు చేరడంతో కొన్ని వందల ఎకరాల్లో చేతికొచ్చిన సోయాపంటతో పాటు పత్తి పంట సైతం నీట మునిగిందని తెలిపారు.గోదావరి నది నీరు సైతం ఇదే మార్గాన ఆయా పంట పొలాలకు పారుతూ సాగుకు నీరందేదని గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా పూడ్చుకుపోయిందని పేర్కొన్నారు. ఈ రోడ్డు వెంబడే రాకపోకలు కొనసాగిస్తూ ఎంతోమంది మత్స్యకారులు జీవనోపాధి కొనసాగించే వారని అలాంటి వారికి ఇపుడున్న పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో వారి జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లిందని వెల్లడించారు.నీటి పారుదల శాఖ సిబ్బంది,ఉన్నతాధికారులు జరిగిన నష్టంపై నివేదిక తయారు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు.జరిగిన నష్టంపై మాజీ శాసనసభ్యులు,నియోజకవర్గ ఇంచార్జ్ నారాయణ రావు పటేల్,జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ,మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని నాయకులు రావుల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంగు సాయిలు, బొప్పారం ముత్యం రెడ్డి, గున్నక్కల పోషెట్టి, గొండ్ల పోశెట్టి,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు

## కీర్గుల్ (కె) అంబరాన్నంటిన నిమజ్జన వేడుకలు

## కన్నుల పండువగా శోభాయాత్ర

## అడుగడుగునా భక్తుల నీరాజనం


## దారి పొడవునా నృత్యాల హోరు





**ఆగస్టు 31 తెలంగాణ సేన ( ప్రతినిధి) నిర్మల్ జిల్లా :-** బాసర మండల కేంద్రంలో కీర్గుల్( కె) గ్రామంలో ఈ సంవత్సరం పెద్దలు విడిసి నిర్ణయం తో ఊరిలో ఒకే గణపతి కూర్చోబెట్టి అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలుకుతున్న గ్రామస్తులు గ్రామ యువకులు. ఐదు రోజులు ఘనమైన పూజలందుకున్న గణప య్యకు ఆదివారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. రంగు రంగుల కాగి తాలు, పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహా లను ఉంచి కన్నుల పండువగా శోభయాత్ర నిర్వహించారు. దారి పొడవునా డప్పు చప్పుళ్ళు, నృత్యాల హోరుతో వైభవంగా సాగిన వినాయక నిమజ్జనంలో అడుగడుగునా గణపయ్యకు భక్తులు నీరాజనం పలికారు. జై గణపతి జై జై గణపతి.., గణపతి బొప్ప మోరియా ఆదాలడ్డూ కాలియా అం టూ భక్తులు, యువతీయువకుల నినాదాలు మిన్నంటగా తీన్మార్ డ్యాన్సు లు, ప్రత్యేక డీజే చప్పుడ్లతో పాటు అతివల కోలాటం, చిన్నారుల కేరింతల నడుమ విఘ్నేశుడిని వాగులు, చెరువులు, బావుల్లో నిమజ్జనం చేసి 'పోయిరా గణపయ్యా పోయిరా' అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు.

# పూర్వ విద్యార్థి కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి ఆగస్టు 31:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ సి 1994- 95 బ్యాచ్ పూర విద్యార్థి బోడిగ తిరుపతిగౌడ్ కుమారుడు బోడిగే సందీప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు సందీప్ కు ఇద్దరు చిన్నారులు ఉండడంతో వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రులందరు పూనుకున్నారు. తలా కొంత వేసుకొని పూర్వ విద్యార్థులు (మిత్రులు) కొందరు ఆదివారం వారి ఇంటికి వెళ్లి పిల్లల పేరున ఆర్థిక సహాయం(?10వేలు) అందజేశారు. చిన్ననాటి మిత్రుని కుటుంబము కష్టాల్లో ఉందని తెలుసుకొని చేదోడు వాదోడుగా ఉండాలని మంచి ఆలోచనతో పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి మిత్రుని కుటుంబానికి అండగా నిలవడం పట్ల పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోరే కుమార్, గోస్కుల చందు, అలిసిరీ శశిభూషణ్, చీకోటి వెంకటరమణ, పిన్ రెడ్డి రాజేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థి బొడిగ తిరుపతిగౌడ్ అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అలేం పాపయ్య కుటుంబానికి అండగా ఆదివాసి ఉద్యోగులు



**కొత్తగూడ తెలంగాణ సేన** :మండలం లోని ఓటాయి ఆదివాసి ఉద్యోగ సంఘం తరపున అలెం పాపయ్య ఇటీవల కాలం చెందారు వారి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆర్థిక సహాయం గా ఎంచగూడెం దొర పటేల్ ల కుల పెద్దల సమక్షంలో వాసం సమ్మక్క గార్కి 10500 రూపాయలు అందజేయడం జరిగింది వారి కుటుంబానికి వారికి ఓటాయి ఆదివాసీ ఉద్యోగ సంఘం తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ధనుసరి సాంబయ్య టీచర్ ధనసరి కృష్ణమూర్తిధనుసరి అంజయ్య దనసరి రమేష్ గట్టి సత్యనారాయణ గట్టి శోభన్ ధనసరి ప్రసాద్ దనసరి లక్ష్మణ్ కుమార్ ధనసరి శ్రీరాములు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**గంగారం తెలంగాణ సేన** : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడెం మూల మలుపు వద్ద 102 వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఆదివాసీ యువకుడు మృతి గంగారం మండల కేంద్రం జజ్జరి వారి గుంపు కు చెందిన జజ్జర్ గణేష్ మృతి వీరి మరణ వార్త తెలియగానే జీర్నించుకోలేకపోతున్నా గ్రామస్థులు ... గంగారం లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అలేం పాపయ్య కుటుంబానికి అండగా ఆదివాసి ఉద్యోగులు



**కొత్తగూడ తెలంగాణ సేన** :మండలం లోని ఓటాయి ఆదివాసి ఉద్యోగ సంఘం తరపున అలెం పాపయ్య ఇటీవల కాలం చెందారు వారి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆర్థిక సహాయం గా ఎంచగూడెం దొర పటేల్ ల కుల పెద్దల సమక్షంలో వాసం సమ్మక్క గార్కి 10500 రూపాయలు అందజేయడం జరిగింది వారి కుటుంబానికి వారికి ఓటాయి ఆదివాసీ ఉద్యోగ సంఘం తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ధనుసరి సాంబయ్య టీచర్ ధనసరి కృష్ణమూర్తిధనుసరి అంజయ్య దనసరి రమేష్ గట్టి సత్యనారాయణ గట్టి శోభన్ ధనసరి ప్రసాద్ దనసరి లక్ష్మణ్ కుమార్ ధనసరి శ్రీరాములు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం నూతన నియోజకవర్గ మండల కమిటీల నియామకం

## జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్‌లి



**నర్సంపేట తెలంగాణ సేన :** చెన్నారావుపేట మండల కేంద్రంలో మండల ఇంచార్జ్ చెన్నూరి రవి, మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరై నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ జిల్లాలో మండలాల వారీగా నూతన కమిటీల నియామకంలో భాగంగా నర్సంపేట నియోజకవర్గం లోని చెన్నారావుపేట మండల కమిటీని ఎన్నుకుకోవడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా కూడా అన్ని మండలాల్లో బీసీల బలోపేతం కోసం ఉత్సాహంగా పని చేసే వారికి అవకాశాలు కల్పిస్తామని డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా చెన్నూరి రవి, జిల్లా కార్యదర్శిగా కౌడగాని రాజీరు, నర్సంపేట డివిజన్ యూత్ అధ్యక్షునిగా చెట్టబోయిన రఘు లతో పాటు చెన్నారావుపేట మండల నూతన కమిటీని ఎన్నుకుకోవడం జరిగిందని డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. మండల నూతన అధ్యక్షుడిగా బర్ల యాకయ్య, ఉపాధ్యక్షులుగా పులి రమేష్, ముత్యం చేరాలు, ప్రధాన కార్యదర్శిగా చామంతుల రమేష్, కార్యదర్శిగా గొర్రె నవీన్, మండల కార్మిక సంఘం అధ్యక్షునిగా బండి వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షునిగా బోనగిరి శరత్, ఉపాధ్యక్షుడిగా ఎగితి రాము, ప్రధాన కార్యదర్శి గా దాసరి రాము లను ఎన్నుకుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం రమేష్, బీసీ జిల్లా నాయకులు మరుపల వీరస్వామి, చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముంజ లక్ష్మి, కారుపోతు శ్రీదేవి, మీరాల కుమారస్వామి, కంచ యాదగిరి, కుండెడు మల్లేష్, మీరాల వెంకన్న, గుర్రం రవి, బుర్ర సుదర్శన్ గౌడ్, చీకటి నందు, జంపాల నవీన్, పొలిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

# జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ముషీరాబాద్, ఆగస్టు 31 :** జనహిత సేవా ట్రస్ట్, యువశక్తి యూత్ అసోసియేషన్, కిమ్స్ ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముషీరాబాద్ లోని జమిస్తాన్ పూర్ లో యువశక్తి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద జరిగిన శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ లు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, క్యాంపు కో ఆర్డినేటర్ లు బి. నర్సింగ్ రావు, జే. విక్రమ్ పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో 121 దుర్గాలను అధిరోహించానంటున్న ఏడేళ్ల చిన్నారి

## ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక




మీరెప్పుడైనా ఒక దుర్గాన్ని (కోటను) ఎక్కడానికి వెళ్లినప్పుడు, రెండు జడలు వేసుకుని, ముళ్ల పొదలను తెంపుకుంటూ ముందుకు వెళ్తున్న చిన్నారి అక్కడ కనిపించిందంటే ఆమె పేరు శర్విక.ఏడేళ్ల ఆ బాలిక ఇప్పటికే 121 కోటలు ఎక్కేసింది. ఇదొక్కటే కాదు...'ఛత్రపతి శివాజీ మహరాజ్ కి జై' అనే నినాదాలతో మరిన్ని కోటలు ఎక్కడానికి సన్నద్ధమవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ట్రెక్కింగ్‌కు క్రేజ్ పెరిగిపోయింది. మహారాష్ట్రలో చాలామంది పర్వతారోహకులు (ట్రెక్కర్లు) కనిపిస్తుంటారు. కానీ ఏడేళ్ల వయసున్న ట్రెక్కర్లు చాలా అరుదు.సహ్యాద్రి పర్వతాల్లోని 121 కోటల్లో ఆమె భారత జాతీయ జెండాను ఎగరేసింది. ఒక కోటను ఎన్నిసార్లు అధిరోహించినా, దాన్ని ఒక్కసారిగానే ఆమె పరిగణిస్తుంది.మహారాష్ట్రలో అత్యంత ఎత్తయిన శిఖరం ఎక్కిన అతి చిన్నవయస్కురాలు శర్విక జితేన్ మాత్రే. ఆమె పేరు మీద చాలా రికార్డులున్నాయి.ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఓఎంజీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటివాటిలో ఆమె పేరు నమోదయింది.రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి ఒక కోట ఎక్కింది. మహారాష్ట్రలో అధిరోహించడం కష్టంగా భావించే కోటల్లో పన్వేల్- కర్జాట్ దగ్గరలోని కల్వంటిన్ శుక్లా కోట ఒకటి. మహారాష్ట్ర నుంచి ఈ కోట ఎక్కిన మొదటి బాలిక శర్విక.మూడేళ్ల వయసులో ఆమె నాసిక్ జిల్లాలోని సల్హేర్ కోటను అధిరోహించింది. మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతాల్లో అత్యంత ఎత్తయిన దుర్గం ఇదే.నాలుగేళ్ల వయసు రాకముందే కల్సుబాయ్ శిఖరాన్ని అధిరోహించింది. మహారాష్ట్రలో ఇదే ఎత్తయిన కొండ. నాలుగేళ్ల వయసులో ఆ చిన్నారి గుజరాత్‌లోనే ఎత్తయిన గిర్నార్ శిఖరాన్ని ఎక్కింది.ఏడేళ్ల వయసుకు శర్విక 121 కొండలను ఎక్కింది. వాటిలో ఎక్కువభాగం ఎక్కడానికి కష్టంగా ఉండేవి, దుర్భేధ్యమైనవే. మహారాష్ట్రలోని రాజ్‌గఢ్, రాయ్‌గఢ్ మొదలుకుని రోహిడా, పురందర్, కైలాస్‌గఢ్..ఇలా అనేకం ఆమె అధిరోహించిన దుర్గాల జాబితాలో ఉన్నాయి.

**రెండున్నరేళ్ల వయసులోనే కోట అధిరోహణ**

రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి రాయ్‌గఢ్ కోటను ఎక్కింది. తనకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టమని, శివాజీ మహరాజ్ కోటలు ఎక్కేవారని శర్విక బీబీసీతో చెప్పింది."శివాజీ మహరాజ్ కథలు వింటుంటే నాకు సంతోషంగా ఉంటుంది. ప్రత్యేక శక్తి వచ్చిన అనుభూతి కలుగుతుంది" అని శర్విక చెప్పింది.

**ఏడేళ్ల వయసులోనే ఎంతో మందికి రోల్ మోడల్**

ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు కొంతమంది ధైర్యం కోల్పోతారని, కానీ వారు శర్విక కోటను ఎక్కుతున్న విధానం చూస్తే, తాము కూడా కోట చివర వరకు ఎక్కడం మొదలుపెడతారని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు."శర్విక కోట ఎక్కిన తర్వాత ఎవరో ఒకరు ఆమె వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తారు. మేం అక్కడినుంచి ఇంటికి చేరుకునే సమయానికి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుంటుంది" అని ఆమె తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.మొదటిసారి రాయ్‌గఢ్ కోట ఎక్కిన తర్వాత కోటలంటే తనకు అంతకంతకూ ఇష్టం పెరుగుతోందని శర్విక బీబీసీతో



చెప్పారు.శర్విక తల్లిదండ్రుల పర్వతారోహకులు. వాళ్లిద్దరికీ ట్రెక్కింగ్ అంటే ఇష్టం. అలా పర్వతారోహణపై శర్వికకు కూడా ఆసక్తి పెరిగిందని ఆమె తల్లి అమృత మాత్రే చెప్పారు.

**చిన్నతనం నుంచి ఫోన్, టీవీకి ఆమడ దూరం**

శర్వికకు ఫోన్, టీవీ చూడాలన్న ఆలోచన ఉండదు. తల్లిదండ్రులు వాటి నుంచి ఆమెను దూరంగా ఉంచారు. శారీరక వ్యాయామం, బయటికెళ్లి ఆడుకోవడం శర్వికకు ఇష్టం.ట్రెక్కింగే కాకుండా ప్రస్తుతం రాక్ క్లైంబింగ్‌ను కెరీర్‌గా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది శర్విక.కోటలు ఎక్కడం ఇప్పుడామెకు హాబీ అయింది. ఆమెకు, ఆమె కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్న హాబీ ఇది.ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక.ప్రతి కోట నుంచి శర్విక మట్టి సేకరిస్తుంది. దాన్ని ఇత్తడి పాత్రలో దాస్తుంది. అది ఏ కోట నుంచి తెచ్చిందో దానిని పేరును ఆ పాత్ర మీద రాస్తుంది.తాను విన్న పూర్వీకుల కథలను ఆమె బీబీసీ బృందానికి చెప్పింది.ఆగ్రా కోట నుంచి శివాజీ మహరాజ్‌కు స్వేచ్ఛ లభించడం నుంచి హిర్కానీ సాహస కథలదాకా ఇందులో ఉన్నాయి. శివాజీ జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలు ఆమె దగ్గర ఉన్నాయి.

రాక్ క్లైంబింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న ఆశయం

శర్వికకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. అందుకే ఆమెకు రాక్ క్లైంబింగ్ నేర్పించాలని ఆమె తండ్రి నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆమె కుటుంబం అలీబాగ్ నుంచి పుణెకు మకాం మార్చింది. రాక్ క్లైంబింగ్‌లో భారత్‌కు శర్విక ప్రాతినిధ్యం వహించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు."అలీబాగ్ చాలా బాగుంటుంది. కానీ, శర్విక కోసం ఇష్టం లేకపోయినా పుణెకు మారాం" అని శర్విక తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.శర్విక చరిత్ర సృష్టిస్తుందని ఆమె కోచ్ అమోల్ జోగ్‌దండ్ విశ్వాసం వ్యక్తంచేశారు. శర్విక మొదటిసారి పైకి ఎక్కడం చూసినప్పుడు తాను నమ్మలేకపోయానని ఆయన అన్నారు. ఒక చిన్నారి అంత బాగా కోటలను ఎలా ఎక్కగలుగుతుందోనని ఆశ్చర్యపోయినట్లు ఆయన చెప్పారు.ప్రపంచ వేదికపై తన పేరు రాసుకోగల సామర్థ్యం ఆమెకుందని తనకు అనిపిస్తోందని అమోల్ తెలిపారు.

**'శివాజీ కోటలను పరిరక్షించాలి'**

శర్వికకు కోటలు ఎక్కడం ఇష్టం. అలాగే ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివాటన్నింటినీ ఏరివేస్తుంది. ట్రెక్కింగ్ అయిపోయిన తర్వాత సేకరించిన వ్యర్థాలన్నింటినీ చెత్తబుట్టలో వేస్తుంది."కోటలను మరమ్మత్తు చేయడానికి, పరిరక్షించడానికి నేటి తరం చర్యలు తీసుకుంటే మహారాష్ట్ర కోటలు మళ్లీ పూర్వవైభవం సాధించడానికి ఎక్కువ రోజులు పట్టదు" అని శర్విక తండ్రి చెప్పారు.

# బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పమని సావర్కర్‌ను గాంధీ కోరారా?





కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరీ రాసిన 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' అనే పుస్తకం ఇటీవల విడుదలైంది. ఈ పుస్తకంలో వీడీసావర్కర్ రచనలను, ఆయన వ్యక్తిత్వాన్ని అరుణ్ శౌరీ నిశితంగా సమీక్షించారు.సావర్కర్ రాసిన పత్రాలు, బ్రిటిషు రికార్డుల ఆధారంగా అరుణ్ శౌరీ ఈ పుస్తకాన్ని రాశారు

**బ్రిటిషు వారితో సావర్కర్**

వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సావర్కర్‌ను దేశభక్తుడు, జాతీయవాది అని బీజేపీ పిలుస్తుండగా, కాంగ్రెస్ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.సావర్కర్ గొప్ప హేతువాది అని, ఆ విషయంలో ఆయనను అభినందిస్తున్నట్లు అరుణ్ శౌరీ తెలిపారు."సావర్కర్ అనేక ఆచారాలను ప్రశ్నించారు, దానికి ఆయనను అభినందిస్తున్నాను. కానీ, ఆయన బ్రిటిషు వారికి సాయం చేశారు" అని అరుణ్ అన్నారు."జాతీయ స్థాయిలో స్వాతంత్ర్యం కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు బ్రిటిషు వారికి సావర్కర్ మద్దతుగా నిలిచారు. బ్రిటిషు వారికి రాజకీయంగా సహాయం చేస్తానని వాగ్దానం చేశారు" అని అరుణ్ శౌరీ చెప్పారు."సావర్కర్ బ్రిటిషు వారి షరతులను అవసరానికి మించి అంగీకరించారు. అవి ఆయనను జైలు నుంచి విడుదల చేయడానికి సంబంధించినవి కూడా కావు. సావర్కర్ వైస్రాయ్ లిన్‌లిత్‌గోను కలిసినప్పుడల్లా, ఆ సమావేశానికి సంబంధించిన పూర్తి రికార్డును లిన్‌లిత్‌గో లండన్‌కు పంపేవారు. ఆ రికార్డులలో 'సావర్కర్ నన్ను రెండుసార్లు వేడుకున్నారు' అని లిన్‌లిత్‌గో రాశారు" అని అరుణ్ తెలిపారు.

**సావర్కర్ క్షమాపణ**

సావర్కర్ రాసిన క్షమాపణలపై అనేక ఊహాగానాలు ఉన్నాయి. వాస్తవానికి, నాసిక్ కలెక్టర్ హత్యలో సావర్కర్ దోషిగా తేలారు. ఆయనపై 25 సంవత్సరాల చొప్పున రెండు వేర్వేరు శిక్షలు విధించారు.ఆ శిక్షను అనుభవించడానికి ఆయనను అండమాన్ (కాలాపానీ)కి పంపారు. జైలుకు వెళ్లిన తర్వాత సావర్కర్ బ్రిటిషు వారికి చాలా క్షమాపణ లేఖలు రాశారు. ఈ విషయంపై పలువురు సావర్కర్‌ను విమర్శించారు.అయితే, బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పడాన్ని సావర్కర్, ఆయన మద్దతుదారులు సమర్థించుకున్నారు.అది తమ వ్యూహంలో భాగమన్నారు. దీంతో కొన్ని రాయితీలు పొందవచ్చన్నారు. సావర్కర్ ఇచ్చిన ఈ వివరణను అరుణ్ శౌరీ తన పుస్తకంలో ప్రస్తావించారు.సావర్కర్ క్షమాపణలను శివాజీ వంటి వ్యూహాలుగా అరుణ్ శౌరీ భావించడం లేదు."శివాజీకి (ఔరంగజేబు లేదా ఆయన సైన్యం వల్ల) ఎప్పుడు ఇబ్బందులు ఎదురైనా, దక్షిణాదిని గెలవడానికి సహాయం చేస్తానని ఔరంగజేబుకు ఉత్తరం రాసేవారు. ఔరంగజేబు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, శివాజీ మళ్లీ తన పని తాను చేసుకునేవారు. కానీ, సావర్కర్ బ్రిటిషు వారి వద్ద శివాజీ వ్యూహాన్ని అనుసరించారా? అంటే కచ్చితంగా కాదు. ఆయన బ్రిటిషు వారికి సాయం చేస్తూనే ఉన్నారు" అని అరుణ్ తెలిపారు.



**క్షమాపణ కోరమని గాంధీజీ అడిగారా?**

సావర్కర్ దుష్ప్రచారాలకు బాధితుడని 2021లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బహిరంగ వేదికపై వ్యాఖ్యానించారు. గాంధీజీ కోరిక మేరకే సావర్కర్ క్షమాపణలు రాశారని ఆయన ఆరోపించారు.దీనిపై అరుణ్ శౌరీ మాట్లాడుతూ "1910లో సావర్కర్‌ని దోషిగా నిర్ధరించిన విషయం ఆయనకు (రాజ్‌నాథ్‌సింగ్‌కు) తెలియకపోవచ్చు. జైలు శిక్ష అనుభవించేందుకు సావర్కర్‌ను అండమాన్‌కు పంపారు. అయితే, ఆయన రెండు నెలల్లోనే క్షమాపణ చెప్పారు. ఆ తర్వాత అనేక క్షమాపణ లేఖలు రాశారు. ఆ సమయంలో గాంధీ దక్షిణాఫ్రికాలో (1910–11) ఉన్నారు. 1915లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చారు. సావర్కర్ అప్పటికే నాలుగేళ్లు జైలులో ఉన్నారు, ఐదు క్షమాపణలు దాఖలు చేశారు" అని అన్నారు.శౌరీ వివరిస్తూ "రాజకీయ ఖైదీలందరికీ బ్రిటిషు వారు సాధారణ క్షమాభిక్షప్రకటించినప్పుడు సావర్కర్ పేరును అందులో చేర్చలేదు. దీంతో సావర్కర్ తమ్ముడు నారాయణ్ గాంధీజీ సలహా కోరారు. దీంతో సావర్కర్ తన పిటిషన్‌లో తాను రాజకీయ ఖైదీ అని రాస్తే, అప్పుడు ఆయన కూడా క్షమాభిక్ష పరిధిలోకి వస్తారని గాంధీజీ సూచించారు. సావర్కర్ అదే చేశారు. ఆయనతో పాటు జైలులో ఉన్న తన సోదరులు భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకం కాదని హామీ ఇచ్చారు" అని తెలిపారు.

**గాంధీజీకి మిత్రుడా?**

1948లో మహాత్మాగాంధీ హత్యకు గురైన ఆరో రోజున, ఈ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై సావర్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఫిబ్రవరి 1949లో ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు.సావర్కర్ ప్రకారం, ఆయన ఒకప్పుడు గాంధీజీకి స్నేహితులు. ఇంతకీ గాంధీజీతో సావర్కర్‌కు ఎలాంటి సంబంధం ఉండేది. ఇద్దరూ స్నేహితులేనా?ఈ ప్రశ్నకు అరుణ్ శౌరీ సమాధానమిస్తూ "అస్సలు కాదు. నిజానికి గాంధీజీని సావర్కర్ అసహ్యించుకున్నారు. గాంధీజీని ఆయన మూరు?డు, పిచ్చివాడనేవారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అంటుండేవారు. 'నడిచే ప్లేగు' అనేవారు" అని తెలిపారు.

**'హిందుత్వ నుంచి హిందూమతాన్ని కాపాడాలి'**

సావర్కర్ 1923లో 'హిందుత్వ – ఎవరు హిందువు?' అనే పుస్తకం రాశారు. ఇందులో ఆయన తొలిసారిగా హిందుత్వను రాజకీయ సిద్ధాంతంగా ఉపయోగించుకున్నారు.దీనిపై అరుణ్ శౌరి స్పందిస్తూ "సావర్కర్ తను రాసిన పుస్తకంలో హిందుత్వ, హిందూయిజం చాలా భిన్నమైనవని రాశారు" అని తెలిపారు.హిందూమతాన్ని హిందుత్వనుంచి కాపాడాలని శౌరీ 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' పుస్తకంలో విజ్ఞప్తి చేశారు."సావర్కర్ ఆశించిన హిందుత్వం వస్తే ఇక మనది భారతదేశం కాదు, పాకిస్తాన్‌గా మారుతుంది. అది 'కాషాయరంగులోని ఇస్లామిక్ రాజ్యం' అవుతుంది" అని శౌరీ అభిప్రాయపడ్డారు."సావర్కర్ హిందుత్వం క్రూరత్వాన్ని, ద్వేషాన్ని బోధిస్తుంది. ఒక సమాజం అటువంటి విలువలను అవలంబిస్తే హిందూ మతం ఎక్కడ మిగులుతుంది?" అని అరుణ్ శౌరీ ప్రశ్నించారు.

# ఫాల్స్ కిల్లర్ వేల్స్: ఇవి ఒడ్డుకు ఎందుకు వచ్చాయి, వీటిని కాల్చి చంపాలని ఎందుకనుకుంటున్నారు?



ఆస్ట్రేలియాలోని టాస్మానియా దీవిలో ఓ మారుమూల తీరం వద్ద పెద్ద ఎత్తున చిక్కుకుపోయి అవస్థ పడుతున్న 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్య మరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు. 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' అనేవి డాల్ఫిన్ జాతికి చెందిన జంతువులు.సంక్లిష్ట పరిస్థితుల కారణంగా వీటిని కాపాడటం అసాధ్యమని అక్కడికి చేరుకున్న నిపుణుల బృందం చెప్పింది.టాస్మానియా దీవి వాయువ్య మూలన ఉన్న ఆర్థర్ నది ఒడ్డుకు 157 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' కొట్టుకు వచ్చాయి. అక్కడికి చేరిన కొద్దిసేపటికే 67 చనిపోయాయి. దీంతో మిగిలిన 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్యమరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు.టాస్మానియాలో ఇటీవల సంవత్సరాలలో తిమింగలాలు కొట్టుకొచ్చిన సంఘటనలు చాలానే చోటుచేసుకున్నాయి. 2020లో ఇక్కడ భారీ సంఖ్యలో తిమింగలాలు కొట్టుకు వచ్చాయి. కానీ, గడిచిన 50 ఏళ్లలో 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడూ కొట్టుకు రాలేదు.

**6 మీటర్లు, 1.5 టన్నుల బరువు**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' సాంకేతికంగా ప్రపంచంలోనే అతిపెద్ద డాల్ఫిన్ జాతికి చెందినది. ఓర్కా(కిల్లర్ వేల్)తో దగ్గరి పోలికలు ఉంటాయి. ఇవి 6 మీటర్లు (19 అడుగులు) వరకు పెరుగుతాయి. 1.5 టన్నుల బరువు ఉంటాయి.ఈ 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇప్పటికే తీరం వద్ద 24 నుంచి 48 గంటలుగా ఉన్నాయని, ఇవి తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని అధికారులు బుధవారం చెప్పారు.తన కుమారుడు రాత్రి వేళ షార్క్ చేపల వేటకు వెళ్లిన సందర్భంలో ఒడ్డుకు కొట్టుకువచ్చిన ఫాల్స్ కిల్లర్ వేల్స్ గుంపును గమనించి తనకు చెప్పడంతో బుధవారం ఉదయం అక్కడకు వెళ్లినట్టు స్థానిక నివాసి జోసెలిన్ ఫ్లింట్ ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్‌కు చెప్పారు.'అక్కడ వాటి కళ్లు సాయం చేయమని అభ్యర్థిస్తున్నట్టుగా కనిపించాయి" అని చెప్పారు."నిజంగా అది చాలా భయంకరమైనది" అని ఆయన చెప్పారు.

**ఎందుకు చంపుతున్నారు?**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' చిక్కుకున్న ప్రాంతం లాన్‌సెస్టన్ సిటీకి 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రదేశానికి దారీతెన్నూ లేదని, సరైన రవాణా సదుపాయాలు లేవని, రక్షణ పరికరాలను తరలించడం సాధ్యమయ్యే పని కాదని సముద్ర జీవశాస్త్రవేత్త క్రిస్ కర్లియన్ మీడియాకు చెప్పారు. ఇది అత్యంత క్లిష్టమైన ప్రాంతమని ఆయన చెప్పారు."ఈ ప్రాంతానికి ఉన్న మార్గం నిటారుగా రాళ్లతో ఉంటుంది. ఆ దారిలో ఒకే వాహనం వెళుతుంది. అక్కడ, నాలుగు చక్రాల వాహనాలు లభిస్తాయి కానీ, పెద్దగా ఉండవు" అని తెలిపారు.'ఫాల్స్ కిల్లర్ వేల్స్'ను ఒడ్డు నుంచి తిరిగి సముద్రంలోకి పంపేందుకు అనువైన వాతావరణ పరిస్థితులు లేవు. అధికారులు ఓ రెండింటిని సముద్రంలోకి పంపడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.ఎగసిపడే అలలను దాటి ఇవి ఈత కొట్టలేవు, అందుకే అవి వెనక్కు కొట్టుకువచ్చేస్తున్నా యని టాస్మానియా ఉద్యానవనాలు, వన్యప్రాణి సేవలకు చెందిన షెల్లీ గ్రహం చెప్పారు.మరో రెండురోజులపాటు వాతావరణం ఇలాగే ఉంటుందనే అంచనాల నడుమ పశువైద్య నిపుణులు వీటికి కారుణ్య మరణం ప్రసాదించాలనే కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నారు."ఇవి ఇక్కడ ఎంత ఎక్కువసేపు ఉంటే అంత ఎక్కువ బాధను అనుభవిస్తాయి. ప్రత్యామ్నాయ పద్ధతులన్నీ విఫలమయ్యాయి. కారుణ్యమరణమనేది చివరి ఎంపిక" అని డాక్టర్ కార్త్లెన్ చెప్పారు.వీటిని కాల్చి చంపే పని బుధవారం మొదలై గురువారం కూడా కొనసాగుతుందని చెప్పారు.